

నల్లనేలలో నారీ భేరీ!

నిన్నటి దాక ఇంటినుంచి కాలు బయటపెడితే వేధింపులు.. అవమానాలు.. అడ్డుకునే కుటుంబికులతో తల్లడిల్లిన మహిళ నేడు పురుషులకు దీటుగా రాణిస్తోంది. అయితే ప్రకృతికి విరుద్ధంగా పగలు రేయికి తేడా తెలియని అదో జగత్తులో వేలాది అడుగుల లోతు భూమి పొరల్లో నిక్షిప్తమైన నల్ల బంగారాన్ని వెలికితీసే మహత్తర యజ్ఞంలోనూ నేడు మహిళలు తమకు సాటిలేదని నిరూపిస్తున్నారు. సంకల్పమే శ్వాసగా పురుషులకు దీటుగా సింగరేణిలో మహిళాశక్తి కదం తొక్కుతుంది. అమ్మగా, అమ్మాయిగా, చెలియగా, చెల్లాయిగా ఇంటిని నడిపిన ఇంతులు నేడు కట్టుబాట్లను తెంచుకొని నల్ల బంగారులోకంలో కాంతి పుంజాలుగా వెలుగొందుతున్నారు. నేడు మహిళా దినోత్సవం సందర్భంగా సింగరేణి బొగ్గు గనుల్లో మహిళా ప్రాతినిధ్యంపై ప్రత్యేక కథనం..



సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో మహిళల భాగస్వామ్యం

కవితానాయుడు, జనరల్ మేనేజర్ (పర్సనల్)

సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో మహిళలు భాగస్వాములను చేశాం. భూగర్భ బావుల్లో మహిళా ఉద్యోగులు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. బదిలీ వర్కర్లుగా, ఎలక్ట్రీషియన్లుగా, ఫిట్టర్లుగా 80 మంది మహిళలు పని చేస్తున్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి.



ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి

నిలోలస్ బెనడిక్ట్, సింగరేణి రిక్రూట్‌మెంట్ జనరల్ మేనేజర్

మహిళలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకుని అన్నిరంగాల్లో రాణించాలి. విద్యతోనే నారీ శక్తిని చాటవచ్చు. ప్రాథమిక దశ నుంచే బాలికలను అన్ని రంగాల్లో రాణించే తత్వాన్ని పెంపొందించాలి. ప్రధానంగా తల్లిదండ్రులు, ఆడ పిల్లలను చదివించాలి.



విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యం

సుజాత, సింగరేణి ప్రధాన ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్

విద్య ద్వారానే మహిళ అభివృద్ధి సాధ్యమవుతుంది. మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి విద్యే ప్రధాన ఆధారం. చేస్తున్న పనిపట్ల అంకిత భావంతో ఉండటం వల్ల ఆయా రంగంలో మహిళలు రాణించే అవకాశం ఉంటుంది. నిర్ణయాలను తీసుకోవడంలో ఆలస్యం చేయకుండా ముందుకు సాగాలి. అప్పుడే మహిళలు రాణించగలరు.

సిరులతల్లి సింగరేణి ఒడిలో మహిళా మాణిక్యాలు

- పురుషులకు దీటుగా మహిళా కార్మికులు
- జీఎంలుగా నలుగురు.. అధికారులుగా 200మంది

ఇల్లెందు/రుద్రంపూర్(సింగరేణి), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బొగ్గుబావుల ఉద్యోగాలంటే పురుషులే వణికిపోతున్న నేటిరోజుల్లో బాధ్యతల బరువులు మోస్తూ, కుటుంబాల పోషణే లక్ష్యంగా బండకింద బతుకులు తెల్లారిపోయే పని పరిస్థితుల్లో అత్యంత ధైర్య సాహసాలతో సింగరేణి కాలరీస్ బొగ్గుగనుల ఉద్యోగాల్లో మహిళలు ఉత్సాహంగా ప్రవేశిస్తున్నారు. పురుష కార్మికులకు దీటుగా తామేం తక్కువ కాదన్నట్లు 135 ఏళ్ల నిండుజవ్వని సింగరేణి ఒడిలో బతుకులపై భరోసా నింపుకొని బొగ్గు మాగాణంలో విధులు నిర్వర్తిస్తున్నారు. సింగరేణిలో ఉద్యోగం అంటే పురుషులే భయం గుప్పిట్లో కూరుకుపోతుంటారు. కానీ రోజులు మారాయి. ఎక్కడమ్మా మనం లేనిది.. ఏమిటమ్మా మనం చేయలేనిది అంటూ బొగ్గుగనుల్లో మహిళా కార్మికులు, ఉద్యోగులు పురుషులతో పోటీపడుతున్నారు. సింగరేణిలో నారీశక్తి జంగ్ సైరన్ మోగిస్తోంది. ఏకంగా వేలాది అడుగుల లోతు భూమి పొరల్లోకి దిగి బొగ్గు నిక్షేపాలు వెలికి తీస్తూ సింగరేణి ఉత్పత్తి లక్ష్యాల సాధనలో మహిళలు తమ శక్తియుక్తులు ధారపోస్తున్నారు. యావత్ బొగ్గు పరిశ్రమలో సింగరేణి కార్మిక మహిళలు నారీభేరి మోగిస్తున్నారు.

మైనింగ్ చట్టాల సవరణతో సువర్ణావకాశాలు..

బొగ్గుగనుల తవ్వకాలు ఆరంభమైన తొలినాళ్లలో, మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా బొగ్గుగనుల్లో మహిళలు పనిచేసేవారు. ఇండియన్ మైనింగ్ యాక్ట్-1923, మైనింగ్ రెగ్యులేషన్-1929 చట్టాలు ప్రమాదకరమైన కోల్ ఇండస్ట్రీలో మహిళలు భూగర్భంలో పనులు చేయడాన్ని, బొగ్గుగనుల పని పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా ఉంటున్నందు వల్ల 1937నుంచి భూగర్భ విధులకు మహిళలను (మిగతా 4వ పేజీలో)

ఖమ్మం, మార్చి7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జనాభాలో 50శాతం ఉన్న మహిళలకు అవకాశాల్లో మాత్రం 50శాతం దక్కడం లేదు. నేడు సమాజంలో మహిళలు అనేక రంగాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నా కీలక రంగాల్లో మాత్రం మహిళల ప్రాతినిధ్యం నామమాత్రంగానే ఉంది. ముఖ్యంగా చట్టసభల్లో మహిళలకు వారికి దక్కాల్సినంత ప్రాధాన్యం దక్కడం లేదు. ఎన్నికలకు ముందు రాజకీయపార్టీలు, నాయకులు చట్టసభల్లో 50శాతం అవకాశాలు కల్పిస్తామంటూ ప్రకటనలు చేయడం తప్ప ఆచరణలో మాత్రం మహిళలకు అవకాశాలు అందని ద్రాక్షగానే మిగులుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ రంగంలోనూ మహిళలకు సరైన అవకాశాలు దక్కడం లేదు. గతంలో ఉమ్మడిజిల్లాలో కీలకమైన భద్రాచలం, ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గాలతో పాటు పలు అసెంబ్లీ స్థానాలు, జడ్పీచైర్మన్ పదవులు సైతం మహిళలకు దక్కేవి. కానీ కొన్నేళ్లుగా జిల్లాలో మహిళా ప్రాతినిధ్యం నామమాత్రంగానే ఉంది.

చట్టసభల్లో సగభాగమేదీ?

- రాజకీయ రంగంలో నామమాత్రంగానే మహిళా ప్రాతినిధ్యం
- మాటలే తప్ప అవకాశాలివ్వని పార్టీలు
- స్థానిక సంస్థల్లోనే 50 శాతం రిజర్వేషన్ అమలు
- ఎంపీ, ఎమ్మెల్యేలుగా అరకొరగానే అవకాశాలు

గతంలో లోక్‌సభకు పలువులు ప్రాతినిధ్యం

ఉమ్మడి రాష్ట్రంలో ఖమ్మం, భద్రాచలం లోక్‌సభ నియోజకవర్గాల్లో భద్రాచలం నుంచి రాధాబాయి ఆనందరావు, ఖమ్మం నుంచి తేళ్ల లక్ష్మీకాంతమ్మలు వరుసగా పలుసార్లు ఎంపీలుగా ప్రాతినిధ్యం వహించారు. ఒకే జిల్లాలో ఇద్దరు మహిళా ఎంపీలు ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1999లో ఖమ్మం నుంచి రేణుకాచౌదరి, భద్రాచలం (మిగతా 4వ పేజీలో)



శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డి

ఘనంగా వకుళమాత స్టేడియం ప్రారంభం

- జమలాపురంలో కనుల పండువగా శ్రీవారి కల్యాణం
- హాజరైన మంత్రి తుమ్మల, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి
- పూజల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి సతీమణి నందిని

ఎర్రుపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కేఎస్ఆర్ గ్రానైట్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మలకుమారి దంపతులు నూతనంగా నిర్మించిన వకుళమాత స్టేడియం (శ్రీవారి కల్యాణమండపం) రుత్వికుల వేదమంత్రోచ్చారణ మధ్య శిఖరప్రతిష్ఠతో శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు నందిని హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వసంత బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి సంవత్సరం శ్రీవారి వార్షిక కల్యాణం నిర్వహించేందుకు భక్తులకు సౌకర్యవంతంగా తుళ్లూరు దంపతులు ఈ కల్యాణ మండపాన్ని నిర్మించి దేవాలయానికి బహూకరించారు. కల్యాణ మండపం ప్రారంభోత్సవం సందర్భంగా ఆగమశాస్త్ర సాంప్రదాయం ప్రకారం శ్రీఅలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి మొట్టమొదటి శాంతికల్యాణం కనులపండువగా నిర్వహించారు.

కార్యక్రమంలో తమిళనాడు నుంచి వచ్చిన మృదంగం, సన్నాయి వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి జమలాపురం శ్రీవారిని దర్శించుకుని కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా దేవస్థానం తరుపున పట్టు వస్త్రాలను, తలంబ్రాలను శ్రీవారికి సమర్పించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త కపిలవాయి అచ్యుతరామారావు శ్రీ వేంకటేశ్వర వైభవం, కల్యాణ వ్యాఖ్యానం చేశారు. గోవింద నామస్మరణతో వకుళమాత స్టేడియం మారుమోగింది. స్టేడియం ప్రారంభం సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సీపీ సునీల్‌దత్, మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఎం.వీరస్వామి, ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, మధిర సీఐ మధు, ఎర్రుపాలెం ఎస్ఐ వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు చావా రామకృష్ణ, ఎర్రుపాలెం సొసైటీ చైర్మన్ మూల్పూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం

- గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి పేరుతో అరాచకం
- ఆర్థికలోటు కారణంగానే సంక్షేమ పథకాలు ఆలస్యం
- వచ్చే వారం నుంచి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి
- 'పాలేరు'లో పలు అభివృద్ధి పనుల ప్రారంభం



కూసుమంచిలో చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకం, అరాచకం వల్లనే తాము పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేయలేకపోతున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి లోటులో ఉన్నందువల్లనే కల్యాణలక్ష్మి పథకంలో 'తులం బంగారం' వంటి పథకాల అమలు ఆలస్యమవుతోందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి మాటను, హామీని అమలు చేసిన తీరుతామన్నారు. కూసుమంచి మండలంలో శుక్రవారం ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పొంగులేటి మాట్లాడుతూ లోటులో ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామన్నారు. అధికారం చేపట్టిన 9నెలల్లోనే నిరుద్యోగులకు 58వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత తమదన్నారు. అర్హులైన లబ్ధిదారులకు రేషన్‌కార్డులు ఇస్తామన్నారు. మరో వారంరోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఎక్కడా తగ్గకుండా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఆలస్యమైనా ఇచ్చిన ప్రతిమాటను, హామీని నిలబెట్టుకుంటామని మంత్రి తెలిపారు.

ప్రభుత్వ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలి

అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి మంత్రి పొంగులేటి పలుశాఖల అధికారులతో సాగు, తాగునీటి సరఫరా, మున్నేరు రిటైనింగ్‌వాల్, ఇందిరమ్మ ఇళ్లనిర్మాణం, రోడ్ల మరమ్మతులు తదితర అభివృద్ధి పనులపై సమీక్షించారు. జిల్లాలో యాసంగిలో ఎక్కడా పంటలు ఎండిపోకుండా సాగర్, పాలేరు (మిగతా 4వ పేజీలో)

మహిళలకు ఆర్టీసీ అద్దె బస్సులు

- నేడు సీఎం చేతుల మీదుగా మహిళా సంఘాలకు అందజేత
- ఖమ్మం రీజియన్‌కు 7 బస్సుల కేటాయింపు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు మహిళా దినోత్సవ కానుక అందించనుంది. మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించింది. మహిళా సంఘాలకు బ్యాంక్ రుణాలు ఇప్పించి వారి ద్వారా బస్సులను కొనిచ్చి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. మహిళా సంఘాలకు ఉపాధి కల్పిస్తూ వారి ద్వారా కొనుగోలు చేసిన బస్సులను హైర్ చేసుకోవాలని ఆర్టీసీ నిర్ణయించింది. బస్సుల కొనుగోలుకు బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. టీజీఎస్ ఆర్టీసీ ఒక్కో బస్సుకు రూ.77,220 అద్దె చెల్లించనున్నది. దేశంలో తొలిసారిగా మహిళా సంఘాలకు అద్దె ఆర్టీసీ బస్సులను కేటాయించటంతో మహిళా సంఘాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 7 బస్సులను మహిళా సంఘాలకు కేటాయించినట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరాం తెలిపారు. శనివారం సీఎం మహిళా సంఘాలకు అందించనున్నట్టు తెలిపారు. రీజియన్ పరిధిలో ఖమ్మం డిపోకు రెండు, మధిరకు 2, సత్తుపల్లికి 2, ఇల్లెందుకు ఒక్క బస్సు కేటా యించినట్లు తెలిపారు. ఈ పల్లెవెలుగు బస్సులకు ప్రత్యేకంగా స్టికరింగ్ వేసి ఆయా డిపోలకు అందించనున్నట్టు తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ఖమ్మం లీగల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాసదన్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కోర్టు ఆవరణలో శనివారం ఉదయం 10:30 గంటలకు జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ.రాజగోపాల్ శుక్రవారం ఓ పకటనలో తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించేదుకు మొత్తం తొమ్మిది బేంచ్‌లను ఏర్పా టు చేస్తున్నట్టు తెలిపారు. వీటి ద్వారా సివిల్, క్రిమినల్, మోటారు ప్రమాద బీమా, చెక్‌బౌన్స్ కేసులను పరిష్కరించనున్నట్టు తెలిపారు.వివాదాల పరిష్కారానికి రాజీ మార్గమే రాజమార్గమన్నారు.

వెబ్‌సైట్‌లో 'టెన్త్' హాల్‌టికెట్లు

విద్యార్థులు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం

కొత్తగూడెం అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల సౌలభ్యం కోసం ప్రభుత్వం వార్షిక పరీక్షల హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. www.bse.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను శుక్రవారం నుంచి అందుబాటులో ఉంచామని విద్యాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ప్రభుత్వ పరీక్షల సంచాలకులు హైదరాబాద్ వారి నుంచి జిల్లా విద్యాశాఖకు ఒరిజనల్ హాల్‌టికెట్లు పంపిస్తారని, పాఠశాలలకు సైతం హాల్‌టికెట్లు అందజేస్తామని ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు తెలిపారు. వివిధ కారణాలతో పాఠశాలల యాజమాన్యాలు హాల్‌టికెట్లు ఇచ్చేందుకు నిరాకరిస్తే విద్యార్థులు ఈ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలు రాయవచ్చని భద్రాద్రి కొత్తగూడెం డీఈవో వెంకటేశ్వ చారి తెలిపారు. ఈనెల 21నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయని, జిల్లాలో 73 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాలో మొత్తం 12,282మంది రెగ్యులర్, 686 ప్రైవేట్ విద్యార్థులకు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

పరీక్షలు ఉదయం 9.30గంటల నుంచి 12.30 నిమిషాల వరకు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతున్న పాఠశాలలకు సమీపంలోనే పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు.

ట్యాక్స్ చెల్లింపుదారులకు శుభవార్త

వడ్డీపై 90 శాతం రాయితీ ప్రకటించిన ప్రభుత్వం

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపుదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మునిసిపల్ కార్యాలయాలకు ట్యాక్స్ చెల్లించాల్సిన వారికి వడ్డీలో ప్రభుత్వం రాయితీని ప్రకటించింది. ఏకంగా 90 శాతం రాయితీని ప్రకటిస్తూ రాష్ట్ర పురపాలకశాఖ అధికారులు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతీ సంవత్సరం ప్రభుత్వం మార్చిలో వడ్డీ రాయితీని ప్రకటిస్తుంది. అయితే ఎన్నికల నియమావళి ఉండటంతో ఆ సారి కొంత జాప్యం జరిగినా మొదటి వారంలోనే వడ్డీ రాయితీ ప్రకటన రావటంతో ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపుదారులుకు కొంత ఉపశమనం కలగనుంది.

చల్లంగ చూడమ్మా...

4

వన దేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యేలు పాయం, కోరం



రామాలయంలో వీణకుమారి

రామయ్యను దర్శించుకున్న తపాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్

భద్రాచలం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని భారత తపాల శాఖ ఢిల్లీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. వీణకుమారి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, తపాల శాఖ ఖమ్మం ఎస్పీ వీరభద్రస్వామి, ఎఎస్పీ అశోక్‌కుమార్, భద్రాచలం పోస్టుమాస్టర్ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ జితేష్ వీ పాటిల్

పౌష్టిక ఆహారంపై విద్యార్థులకు

అవగాహన ఉండాలి

కలెక్టర్ జితేష్ వీ పాటిల్

పాల్వంచ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పౌష్టిక ఆహారంపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అన్నారు. శుక్రవారం పాత పాల్వంచలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చక్కని ఆరోగ్యానికి మంచి ఆహారం సహకరిస్తుందని అన్నారు. ఆహార పదార్థాలను వృథా చేయవద్దని హితవు పలికారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను చక్కగా గ్రహించాలన్నారు. పాఠ్యాంశాల్లో సందేహాలుంటే వెంటనే నివృత్తి చేసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు సైతం పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని అన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కావలసిన ప్రణాళికలను రూపొందించి నివేదికలను పంపాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈవో వెంకటేశ్వరచారి, జిల్లా కో-ఆర్డినేటర్ సైదులు, ఎంఈవో శ్రీరామ్మూర్తి, హెచ్ఎం పద్మలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చల్లంగ చూడమ్మా...

- వరాల వనదేవతలకు... మనసార మొక్కులు
- పగిడిద్దరాజు జాతరకు పోటెత్తిన భక్తులు
- వన దేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యేలు పాయం, కోరం
- నేడు దేవతల వన ప్రవేశం

గుండాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గద్దెనెక్కిన ఇంటి ఇలవేల్పులను దర్శించి తరించేందుకు పగిడిద్దరాజు జాతరకు మూడో రోజు భక్తులు పోటెత్తారు. మేడారం సమ్మక్క భర్త ఆరెం వంశీయుడు పగిడిద్దరాజు జాతర వేడుకలు గుండాల మండలం వేపలగడ్డలో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం వన దేవతలను మొక్కే భక్తులతో జాతర కళకళ



వనదేవతలను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



వన దేవతలను దర్శించుకుంటున్న భక్తులు

లాడింది. గిరిజన ఆదివాసీల ఆరాధ్య దేవతలు సమ్మక్క, పగిడిద్దరాజు గద్దెపై కొలువుదీరడంతో భక్తులు పులకించారు. జయహో సమ్మక్క తల్లి అంటూ వన దేవతలను దర్శించుకున్నారు. శనివారం దేవతలు వన ప్రవేశం చేయనుండటంతో భక్తులు దర్శనానికి పోటీపడ్డారు.

వన దేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యేలు

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను, మేడారం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఆరెం లచ్చు పటేల్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కుమారుడు, యూత్ కాంగ్రెస్ నాయకుడు ధనసరి సూర్య వన దేవతలు పగిడిద్దరాజు, సమ్మక్కను దర్శించుకున్నారు. తలపతులు, పూజారులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు..



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ

రైల్వే అండర్ బ్రిడ్జి కోసం

కృషి చేస్తా: ఎంపీ రఘురాంరెడ్డి

మధిరటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మధిరలో పాత రైల్వే గేట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం కృషి చేస్తానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మధిరలో అండర్ బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశాన్ని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిపి పరిశీలించారు. రైల్వే ట్రాక్ మధిర పట్టణాన్ని రెండుగా విడగొట్టిందని ఆర్‌వోబీ నిర్మించడం వల్ల రైల్వే గేట్‌ను మూసివేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని నాయకులు ఎంపీ దృష్టికి తీసుకు వెళ్లారు, వృద్ధులు, మహిళలు బ్రిడ్జి ఎక్కాలంటే అవస్థలు పడుతున్నారని అన్నారు. రైల్వే మంత్రి దృష్టికి విషయాన్ని తీసుకుపోయి అండర్ బ్రిడ్జి మంజూరుకు కృషి చేస్తానని అన్నారు, అలాగే మధిరలో గతంలో హాల్ట్ ఉండి కరోనా తరువాత హాల్ట్ ఎత్తి వేసిన రైళ్లకు తిరిగి మధిర రైల్వే స్టేషన్‌లో ఆపేలా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల సంక్షేమానికి

అధిక ప్రాధాన్యత ఇస్తాం

- సొంతింటి కల నెరవేర్చేందుకు కమిటీ ఏర్పాటు
- సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరాం



మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సంక్షేమనికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం తెలిపారు. పోటీ మార్కెట్‌ను తట్టుకునేందుకు బొగ్గు ధరలను తగ్గించుకునే చర్యలకు సిద్ధమవుతున్నామని అందుకు కార్మికసంఘాలు సహకరించాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గుర్తింపు కార్మికసంఘం 38నిర్మాణాత్మక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశీ బొగ్గు దిగుమతి, కోల్ ఇండియా ధరల కంటే సింగరేణి ధరలు అధికంగా ఉండటం వల్ల వినియోగదారులు విదేశీ బొగ్గు కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. దీంతో సింగరేణి బొగ్గు ధరలను తగ్గినప్పుడు మెరుగైన సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించునే అవకాశం ఉంటుందన్నారు. సింగరేణి కార్మికుల సొంతింటి కలను నెరవేర్చాలని హైదరాబాద్‌లో సింగరేణి ఆధ్వర్యంలో స్పెషల్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించడంతోపాటు పలు ప్రధాన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశిరావు చైర్మన్ దృష్టికి తీసుకుపోవడంతో కార్మికుల సొంతింటి పథకం ఏర్పాటుకు కమిటీని నియమించనున్నట్లు చైర్మన్ బలరాం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఈడీ సుబానీ, జీఎం పర్సనల్ కవితానాయుడు, గుర్తింపు ప్రధాన కార్మికసంఘం నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు సౌర విద్యుత్ ప్లాంట్‌కు

వర్చువల్‌గా శంకుస్థాపన

- సీఎం, డిప్యూటీ సీఎం చేతుల మీదుగా..

మధిరరూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లికి రూ.3.50కోట్లతో మంజూరైన సోలార్ విద్యుత్ ప్లాంటును సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వర్చువల్‌గా శనివారం శంకుస్థాపన చేయనున్నారు. ప్రధాన మంత్రి కుసుమ్ పథకం కింద ఖమ్మం జిల్లాలో నాలుగు గ్రామాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు మంజూరు కాగా మడుపల్లిలో ఏర్పాటు చేయబోయే ఒక మెగా వాట్ సోలార్ ప్లాంట్‌ను శనివారం శంకుస్థాపన చేయనున్నారు.





సత్తుపల్లిలో సమావేశమైన రిటైర్డ్ ఉద్యోగులు

తార్నాక ఆస్పత్రికి

సూపర్‌లగ్జరీ బస్ నడపాలి

సత్తుపల్లిరూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రిటైరైన ఉద్యోగులకు హైదరాబాద్‌లోని తార్నాక ఆస్పత్రికి ఉచితంగా సూపర్ లగ్జరీ బస్సును సత్తుపల్లి నుంచి నడిపించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం డిపో సెక్రటరీ ఎస్‌వీ.రావు ప్రభుత్వాన్ని, సంస్థను డిమాండ్ చేశారు. శుక్రవారం సత్తుపల్లిలో నిర్వహించిన డిపో గేట్ మీటింగ్‌లో సంఘబాధ్యులు పాల్గొని సంస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. 2017 నుంచి నూతన పేస్కేల్ అమలు చేయాలని, 2022 నుంచి రిటైరైన వారికి లీవ్ ఎన్‌క్యాష్ చెల్లించాలని, 2017నుంచి పెరిగిన జీతం బకాయిలు చెల్లించాలని కోరారు. సంస్థలో 36 ఏళ్ల సర్వీస్ చేసి రిటైరైన ఉద్యోగులు ఎన్నో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, తమకోసం బస్ కేటాయించాలని, అదేవిధంగా చనిపోయిన కార్మికులకు అంతిమ దహన సంస్కారాలకు రూ.30వేలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జీవీ.రావు, గడ్డం శ్రీను, కేఎస్.దాసు, ఆర్‌వీ.కుమార్, సాధు సుధాకర్, ఆర్‌వీ.రావు, ఏవీ.రాయుడు, ఎంఎస్.నారాయణ, కేవీ.కుమార్, ఆర్‌ఆర్‌ఆర్ చారి పాల్గొన్నారు.

నల్లనేలలో నారీభేరి!

(3వ పేజీ తరువాయి)

నిషేధించారు. తదుపరి బొగ్గు పరిశ్రమలో ఉపరితల పనులు, క్లరికల్ క్యాడర్‌లోనే నియమించారు. కాగా 2019 ఫిబ్రవరిలో భూగర్భగనుల్లో మహిళలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తూ చట్టసవరణ చేయడంతో బొగ్గుఉత్పత్తిలోనూ మహిళలు ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం లభించింది. ఈ క్రమంలో 2021లో దేశంలో ప్రప్రథమంగా రాణిగంజ్ బొగ్గుగనుల్లో మహిళా ఇంజనీర్ ఆకాంక్షకుమారి అండర్ గ్రౌండ్ మైనింగ్ ఇంజనీర్‌గా నియమితులయ్యారు. ఆనాటి నుంచి దేశవ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తిలో మహిళలు అవకాశాలు దక్కించుకుంటున్నారు.

కారుణ్య నియామకాలతో సింగరేణిలో పెద్దపీట..

135ఏళ్లుగా బొగ్గు ఉత్పాదన సాగిస్తున్నే సింగరేణి కాలరీస్ కోల్ బెల్ట్ ప్రాంతాల ఆర్థిక, సామాజిక పరిస్థితుల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు భారీగా కల్పించడం ద్వారా పెనుమార్పులు తెచ్చింది. గతంలో భర్తలు మృతిచెండటం, అనారోగ్యాల బారీనపడి మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కావడం వల్ల డిపెండెంట్ ఉద్యోగాలకు సంతానంలో అర్హతలేక మరికొందరు మహిళలు సింగరేణి ఉద్యోగాల్లో చేరారు. కారుణ్య నియామకాల ద్వారా తొలుత బదిలీ వర్కర్లుగా నియమించబడి, 240 మస్టర్లు చేసిన పిమ్మట జనరల్ మజ్దూర్‌లుగా క్రమబద్ధీకరించబడేవారు. మెజారిటీ యువతులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల వైపే మొగ్గుచూపేవారు. కానీ పరిస్థితులు మారాయి. ప్రభుత్వరంగ పరిశ్రమగా ఉద్యోగభద్రత కలిగిన సింగరేణికాలరీస్‌లో ఉద్యోగాలవైపు ఆకర్షితులవుతున్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో యువతులు ఎక్కువగా సింగరేణి ఉద్యోగాల్లో చేయడం గమనార్హం. వారసత్వ ఉద్యోగ నియామకాల్లో గతంలో కొడుకులు, తండ్రుల ఉద్యోగాలు కల్పించేవారు. కాగా నేడు మహిళలు ధైర్యంగా డిపెండెంట్ ఉద్యోగాలు పొందుతూ కుటుంబ భారాలను, బాధ్యతలను నెత్తికెత్తుకుంటున్నారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్, బీటెక్, బీఈడీ, ఎంఎస్, లా డిగ్రీలు చదివిన అనేక మంది యువతులు సింగరేణిలో ఉద్యోగాల్లో ప్రవేశించారు. ఇంజనీరింగ్ డిగ్రీల యువతులకు అవకాశాలు కల్పించడంతో ఏకంగా మైనింగ్ ఇంజనీరింగ్ డిగ్రీలతో భూగర్భంలో బొగ్గునిక్షేపాల వెలికితీతలో కీలకపాత్ర పోషించే స్థాయికి చేరుకున్నారు. డిపెండెంట్ ఉద్యోగాలు పొందినవారిని వర్క్‌షాపులు, ఆటో వర్క్‌షాపులు, సెక్యూరిటీ ఆఫీసుల్లో, జీఎంలు, గనుల కార్యాలయాల్లో, వైద్యశాలల్లో, ఓపెన్‌కాస్టులు, స్టోర్స్ ల్యాంప్ రూముల్లో వివిధ ఉపరితలగనుల విధుల్లో నియమిస్తున్నారు. కాగా అనేకమంది ఉన్నత విద్యార్హతలు కలిగిన యువతులు నేరుగా క్లరికల్, సంక్షేమ అధికారులుగా, ఇంజనీర్లుగా, వైద్యులు, వైద్యసిబ్బందిగా నియామక పరీక్షల్లో ర్యాంకులు సాధించి సింగరేణి ఉద్యోగాలకు ఎంపిక అవుతుండటం గమనార్హం. అనేక మంది ఏసీ కార్యాలయాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు వీడి ఉన్నత డిగ్రీలు కలిగిన యువతీ, యువకులు సింగరేణి ఉద్యోగాలకు అర్రులు చాస్తున్నారంటే మారిన పరిణామాలు అర్థం చేసుకోవచ్చు. తండ్రులను, భర్తలను కోల్పోయి పిల్లలు, కుటుంబ పోషణాభారాల కోసం కారుణ్యనియామకాల్లో చేరుతున్న మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అనేకమంది ధైర్యంగా పేలుడు పదార్థాల మ్యాగ్జిన్లలో, బ్యాటరీలు, క్యాప్‌ల్యాంపుల విభాగాల్లో పనిచేస్తున్నారు. కారుణ్య నియామకాలతో ఉద్యోగాలు పొందిన వారికి ఇంటర్నల్ అభ్యర్థులుగా ఎగ్జిక్యూటివ్ పోస్టులకు అర్హత కల్పించడం, నేరుగా అవకాశాలు కల్పించడంతో గత ఐదేళ్లలో వందలాదిమంది మహిళలు, యువతులు సింగరేణి ఉద్యోగాల్లో ప్రవేశించారు. పురుషులకు దీటుగా తల్లిదండ్రులకు, సంతానానికి ఆలంబనగా ఉంటారన్న కారణాలతో అధికసంఖ్యలో కార్మికులు వారసత్వ ఉద్యోగాలు మహిళలకే అప్పగిస్తుండటం గమనార్హం..



సింగరేణిలో 1996మంది మహిళా ఉద్యోగులు

సింగరేణి పోటీ పరీక్షలు రాస్తూ నేరుగా ఉద్యోగాలకు ఎంపికైనవారు, కారుణ్యనియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన వారు సుమారు 2,200 మంది ఉన్నారు. సింగరేణి ఉద్యోగుల్లో 10శాతం మహిళలు ఉండటం విశేషం. సింగరేణిలో మొత్తం ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులు 40,810 మంది ఉండగా వీరిలో మహిళా ఉద్యోగులు 1996 మంది ఉన్నారు. 198మంది మహిళలు ఎగ్జిక్యూటివ్ అధికారులుగా ఉన్నారు. నలుగురు మహిళలు సింగరేణి కాలరీస్ విధాన నిర్ణయాల్లో కీలకపాత్ర పోషించే జనరల్ మేనేజర్ల క్యాడర్ స్థాయిలో ఉండటం విశేషం. సింగరేణి విస్తరించిన ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంగనగర్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో మహిళలు 31మంది మైనింగ్ ఇంజనీర్లు, ఏడుగురు మెకానికల్ ఇంజనీర్లు, ఏడుగురు సివిల్ ఇంజనీర్లు, ఏడుగురు ఎస్టేట్ అధికారులు, ఇద్దరు అటవీశాఖ, 12మంది ఐటీ విభాగం, 29మంది స్పెషలిస్ట్, 48మంది నాన్‌స్పెషలిస్ట్ వైద్యులు, ఏడుగురు పర్సనల్ డిపార్ట్‌మెంట్, ఐదుగురు లా డిపార్ట్‌మెంట్, 36మంది ఫైనాన్స్ అకౌంట్స్ అధికారులుగా మహిళలు ఉండటం గమనార్హం.

కీలక స్థానాల్లో నలుగురు..

సింగరేణిలో విధాన నిర్ణయాల్లో, పారిశ్రామిక సంబంధాలు, కంపెనీ వ్యవహారాల్లో కీలక అధికారులుగా నలుగురు మహిళలే ఉండటం గమనార్హం. వీరిలో కార్మిక సమస్యలు పరిష్కరించడం, యూనియన్లతో సంప్రదింపులు, ఉద్యోగుల బదిలీల వంటి కీలక నిర్ణయాలు తీసుకునే ఇండస్ట్రియల్ రిలేషన్స్ పర్సనల్ మేనేజ్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్‌గా కవితానాయుడు ఉన్నారు. అదేవిధంగా అధికారుల పదోన్నతులు, సంక్షేమం, సామాజిక సేవాపథకాల కీలక నిర్ణయాలు, నిధుల వ్యవహారాలు నిర్వర్తించే కీలక బాధ్యతల్లో ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిష్‌మెంట్ సెల్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ విభాగాల జనరల్ మేనేజర్‌గా నికోలస్ బెర్నాడెట్ ఉన్నారు. అంతేకాకుండా సింగరేణి బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశాలు, నిర్ణయాల అమలు, సర్వసభ్య సమావేశాలు, విధాన నిర్ణయాల్లో కీలకంగా వ్యవహరించే కంపెనీ సెక్రటరీగా కే. సునీతాదేవి, సింగరేణి వ్యాప్తంగా మెడికల్ విభాగానికి వైద్యశాలలు, డిస్పెన్సరీల నిర్వహణ ఉద్యోగులు, అధికారులు వైద్యసేవలు అందించే కీలక విభాగానికి చీఫ్‌మెడికల్ అధికారిగా సుజాత సేవలందిస్తున్నారు. కొద్ది నెలల క్రితం సింగరేణిలో జరిగిన 360 ఎగ్జాక్యూటివ్ పోస్టుల నియామకాల రాత పరీక్షల్లో మహిళలు 190మంది మైనింగ్, సివిల్, పర్సనల్, అకౌంట్స్, తదితర కీలక విభాగాల అధికారులుగా ఎంపికయ్యారంటే మహిళల భాగస్వామ్యం సాధికారితకు సింగరేణి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోందని చెప్పవచ్చు.

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం

(3వ పేజీ తరువాయి)

రిజర్వాయర్ల నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. సీతారామ భూసేకరణ వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు.

మున్నేరు రిటైనింగ్ వాల్‌కు 178ఎకరాలు భూమి సేకరించాల్సి ఉందని, భూములు కోల్పోతున్నవారికి ప్రత్యామ్నాయంగా భూమిని ఇచ్చేలా రైతులతో చర్చించాలని అన్నారు.

దేవాలయ ప్రాణప్రతిష్ఠల్లో పాల్గొన్న మంత్రి

కూసుమంచి మండలంలోని జుజ్జులరావుపేటలో శ్రీసీతారామాంజనేయ దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. మంత్రికి ఆలయ అర్చకులు, గ్రామస్థులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం తుర్కగూడెం, కేశ్వాపురం, గోపాలరావుపేట గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభించారు. మంత్రి వెంట పలుశాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు రమేష్

ప్రభుత్వాల విధానాలతో

సంక్షోభంలో వ్యవసాయ రంగం

ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు దొండపాటి

బోనకల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ ఆరోపించారు. మండలంలోని రాయనపేటలో శుక్రవారం తూము ప్రకాశరావు భవనంలో నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా, రుణమాఫీ అంశాలలో రైతులలో తీవ్ర అసంతృప్తి నెలకొందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ రైతులను విస్మరిస్తుందన్నారు. ఈ నెల 20వ తేదిన వైరాలో జరగనున్న రైతుసంఘ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆనందరావు, రోశన్ కుమార్, బొమ్మినేని కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పాలనలో నారీ'మణులు'

- ఉమ్మడి జిల్లాలో కీలక బాధ్యతల్లో మహిళలు
- సమర్థ పనితీరుతో సుపరిపాలనకు బాటలు

ఖమ్మం కలెక్టరేట్/ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉత్తరం రాయగల చదువు... వంటల్లో ప్రావీణ్యం.. కుటుంబసభ్యుల ఆలనాపాలన.. ఇది ఒకప్పటి మహిళల జీవన స్థితి.. కానీ కాలంతో పాటు మహిళల స్థితి గతుల్లోనూ ఎంతో మార్పు వచ్చింది. నేడు వ్యవసాయం నుంచి ఐటీ వరకు కాని స్టేబుల్ నుంచి కలెక్టర్ వరకు అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. అటు కుటుంబం, ఇటు ఉద్యోగ బాధ్యతల్ని సమర్థవంతగా నిర్వర్తిస్తూ సమాజంలో తమకంటూ గుర్తింపు పొందుతున్నారు. అయినా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ ఆడపిల్లలపై వివక్ష కొనసాగుతోంది. పుట్టిన వెంటనే వదిలేయడం, అధికారులకు అప్పగించడం వంటి ఘటనలు తరుచూ వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఆడపిల్లలను చులకనగా చూసే వారి ఆలోచన ధోరణి తప్పని నిరూపిస్తున్నారు కొందరు పలువురు మహిళా అధికారులు. ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్‌గా డాక్టర్ శ్రీజ, జిల్లా రెవెన్యూ అధికారిగా పద్మశ్రీ, జిల్లా వైద్యాధికారిగా డాక్టర్ కళావతిభాయి, పంచాయతీ అధికారిగా ఆశాలత, మిషన్‌భగీరథ ఈఈగా పుష్పలత, బాలల అభివృద్ధి అధికారిగా టి విష్ణువందన, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా జీ శ్రీలత, మహిళా ప్రాంగణం అధికారిగా వేల్పుల విజేత, బీసీ అభివృద్ధి అధికారిగా జ్యోతి విధులు నిర్వహిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలోనూ అదనపు కలెక్టర్‌గా విద్యాచందన, డీసీఎస్‌వోగా రుక్మిణీదేవి, పాల్వంచ మునిసిపల్ కమిషనర్‌గా కొడారు సుజాత వంటి వారు కీలక బాధ్యతలు నిర్వర్తిన్నారు.



అదనపు కలెక్టర్ శ్రీజ, డీఆర్వో పద్మశ్రీ, జడ్పీ సీఈవో దీక్షరైనా

(3వ పేజీ తరువాయి)

నుంచి దుంపామేరి విజయకుమారీలు ప్రాతినిధ్యం వహించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో భద్రాచలం నియోజకవర్గం కనుమరుగైంది. ఖమ్మంనుంచి 2004లో రేణుకాచౌదరి రెండోసారి ప్రాతినిధ్యం వహించారు. కేంద్రంలో మంత్రిగా పనిచేశారు.

చట్టసభల్లో సగభాగమేదీ?

భద్రాచలం నియోజకవర్గం నుంచి కర్రెద్దుల కుమలకుమారి కూడా 1989, 1991 రెండుసార్లు లోక్‌సభ నుంచి గెలుపొందారు. పీవీ.నర్సింహారావు ప్రభుత్వంలో ఆమె కేంద్రమంత్రిగా పనిచేశారు. ఇలా గతంలో పలువురు మహిళలు జిల్లా రాజకీయ రంగంలో ప్రముఖపాత్ర పోషించారు. ఇటీవలి కాలంలో మహబూబాబాద్ లోక్‌సభస్థానం నుంచి మాలోతు కవిత ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. గతంలో కేంద్రమంత్రిగా పనిచేసిన రేణుకాచౌదరి ప్రస్తుతం రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

అసెంబ్లీలో నామమాత్రమే..

ఉమ్మడి జిల్లా నుంచి అసెంబ్లీకి మహిళలకు టికెట్లు లభిస్తున్నా విజయాలు మాత్రం అరుదుగానే దక్కుతున్నాయి. పది అసెంబ్లీ స్థానాల్లో ఎప్పుడో ఒక్కరు మాత్రమే ఎమ్మెల్యేగా ఎన్నికవుతున్నారు. ప్రస్తుతం సత్తుపల్లి నుంచి మట్టా రాగమయి జిల్లాలో ఏకైక మహిళ ఎమ్మెల్యేగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లెందునుంచి బానోతు హరిప్రియ ప్రాతినిధ్యం వహించారు. అంతకుముందు వైరానుంచి 2009లో బానోతు చంద్రావతి ప్రాతినిధ్యం వహించారు. శాసనమండలికి మాత్రం జిల్లానుంచి ఒక్క మహిళ కూడా ప్రాతినిధ్యం వహించలేదు.

ఇక ఉమ్మడి ఖమ్మంజిల్లా జడ్పీచైర్మన్‌గా వాణీరమణారావు, గోనెల విజయలక్ష్మి, గడిపల్లి కవిత వ్యవహరించారు. ఇలా చట్టసభల్లో చాలా తక్కువగానే మహిళలకు ప్రాతినిధ్యం లభించింది. కమ్యూనిస్టు ప్రాబల్యం ఉన్న జిల్లాలో మహిళా చైతన్యం ఎక్కువగానే ఉన్నా పార్టీలు వారికి మొక్కుబడిగానే అవకాశాలు కల్పిస్తున్నాయి. స్థానిక సంస్థల్లో మాత్రం 50శాతం రిజర్వేషన్ల విధానం అమల్లోకి వచ్చాక పలువురు మహిళలు సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా, జడ్పీటీసీ, ఎంపీపీలుగా ఎన్నికవుతున్నారు. ప్రస్తుతం ఖమ్మం మేయర్‌గా మాత్రమే పునుకొల్లు నీరజ వ్యవహరిస్తున్నారు. కొందరు మహిళా కార్పొరేటర్లు పదవుల్లో కొనసాగుతున్నారు.

మానవత్వం చాటిన సత్తుపల్లి పోలీస్

- ఆస్పత్రికి రోడ్డు ప్రమాద బాధితుల తరలింపు
- ఎస్ఐ కవిత, కానిస్టేబుల్ లతకు అభినందనలు



ప్రమాద స్థలంలో బాధితురాలికి సాయం చేస్తున్న ఎస్ఐ కవిత, కానిస్టేబుల్ లత

సత్తుపల్లిరూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు మహిళలను సత్తుపల్లి ఎస్ఐ కవిత తన వాహనంలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. క్షతగాత్రులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏన్కూరు మండలం బురద రాఘవాపురం గ్రామానికి చెందిన ఎస్కే కరిష్మా కొత్త వాహనాన్ని కొనుగోలు చేయగా రిజిస్ట్రేషన్ నిమిత్తం ఖమ్మంలో ఉంటున్న తన సోదరి సైదాబీతో కలిసి సత్తుపల్లి ఎంవీఐ కార్యాలయానికి వచ్చారు. అనంతరం తిరిగి వెళ్తున్న క్రమంలో కిష్టారం నర్సింగ్ కళాశాల సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా వెళ్తున్న బొగ్గులారీ నుంచి బొగ్గుమసీ, దుమ్ము బైక్ నడుపుతున్న వారి కళ్లల్లో పడటంతో అదుపుతప్పి కిందపడ్డారు. అదే సమయంలో సత్తుపల్లికి వస్తున్న ఎస్ఐ కవిత, కానిస్టేబుల్ బూరుగు లత సహాయంతో తన వాహనంలోకి ఇద్దరు క్షతగాత్రులను తమ పోలీస్ వాహనంలో ఎక్కించుకుని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. కాగా చేతులు, కాళ్లు, మొఖానికి తీవ్రగాయాలైన ఇరువురు మహిళలను మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. అయితే తాము ప్రమాదంలో ఉన్నపుడు సహాయపడినందుకు క్షతగాత్రులైన కరీష్మా, సైదాబీలు ఎస్ఐ కవిత, సిబ్బందికి ధన్యవాదాలు తెలపగా పలువురు వారిని అభినందించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న వ్యాను



రెండు కాళ్లు విరిగిన డ్రైవర్ శ్రీనివాస్

అశ్వారావుపేట రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని వ్యాను ఢీకొనగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. జంగారెడ్డిగూడెం రోడ్‌లో కాకతీయ గేట్ సమీపంలో రోడ్డు దిగువన లారీ ఆపి ఉంది. రాజమండ్రి వైపు నుంచి ఖమ్మం వైపునకు వెళుతున్న వ్యాన్ ముందు వెళుతున్న ఆటోను తప్పించే క్రమంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న లారీని ఢీకొంది. ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న డ్రైవర్ శ్రీనివాస్‌కు రెండు కాళ్లు విరిగి క్యాబిన్‌లో చిక్కుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి శ్రీనివాస్‌ను బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విజయవాడకు తరలించారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

అశ్వారావుపేట రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా పశువులు తరలిస్తున్న వ్యానును శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం ఒడిసా రాష్ట్రం నుంచి హైదరాబాదుకు ఐషర్ వ్యానులో 18 ఆవులు, 38 ఎద్దులను తరలిస్తున్నారు. వాహనాల తనిఖీలో వాహన పత్రాలను పరిశీలించగా ఎటువంటి అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్నట్లుగా గుర్తించారు. పశువుల తరలింపుకు కారణకులైన రంగారెడ్డి జిల్లాకు చెందిన నునావత్ బాస్కర్, రవీందర్‌పై కేసు నమోదు చేశారు. పశువులను పాల్వంచలోని గోశాలకు తరలించారు.

విధులకు ఆటంకం.. ముగ్గురిపై కేసు

కారేపల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గిద్దవారిగూడెంలో గ్రామ కార్యదర్శి విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదైంది. ప్రజల అవసరాల కోసం ఏర్పాటుచేసిన తాగునీటి బోరుకు నీటిని వ్యవసాయ అవసరాలకు వాడుకుంటున్న ముగ్గురిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎన్. రాజారామ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తాగునీటి బోరును వ్యవసాయ అవసరాలకు వాడుకోవడం సరికాదని పంచాయతీ కార్యదర్శి రమేష్ అభ్యతరం తెలిపారు. దీంతో కార్యదర్శి పనులకు ఆటంకం కలిగంచినట్లు రమేష్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసిన్నట్లు తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి

బూర్గంపాడు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న మహిళను కారు ఢీకొట్టిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాద ఘటన అంజనాపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బూర్గంపాడు మండల పరిధిలోని అంజనాపురం గ్రామానికి చెందిన సపావత్ బాలి(53) అనే మహిళ గ్రామంలో ప్రధాన రహదారి వెంబడి తునికికాయలు అమ్ముతోంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సమయంలో రోడ్డు దాటుతున్న ఆమెను పాల్వంచ వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని కారు బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన కారును అపకుండా వెళ్లడం గమనించిన స్థానికులు కారును వెంబడించిన ఫలితం లేదని తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. మృతురాలి కుమారుడు మల్సూర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

ఏన్కూరు, మార్చి7(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో జరిగింది. తూతుక్కలింగన్నపేట గ్రామానికి చెందిన పసుపులేటి కృష్ణ(28) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఏన్కూరు నుంచి ఇంటికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఇందిరానగర్ గ్రామ సమీపలో టాటా ఏసీ వాహనం ఢీకొనడంతో తీవ్రగాయలయ్యాయి. వెంటనే 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచనమేరకు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఓ వ్యక్తి అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటకు సంబంధించిన వివరాలు.. కల్లూరులో మధిర రహదారి వైపునకు చెందిన ఇమ్మడిశెట్టి మురళీకృష్ణ(59) ఉదయం 7 గంటలకు తన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటి మందు గల రేకుల షెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ హరిత కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్ 'వేడి'



- పెరుగుతున్న ఎండలతో చిన్నారుల ఉక్కిరిబిక్కిరి
- వేసవిలో ఒంటిపూట, మేలో సెలవులు అత్యవసరం
- పౌష్టికాహారం ఇంటికే అందించాలని వేడుకోలు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో చల్లదనం కరువు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పాపం పసివాళ్లు... చిన్న ఎండ తగిలినా, వడగాలి వీచినా తట్టుకోలేరు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో చిన్నారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు .పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేందుకు తల్లిదండ్రులు వెనుకంజ వేస్తున్నారు. కేంద్రాల్లో ఫ్యాన్లు లేక ఉక్కపోతకు పిల్లలు చెమటలు కక్కుతున్నారు. వెలుతురు కూడా సరిగా లేక చీకటి గదుల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు ఎండదెబ్బ తగిలి చిన్నారుల సంఖ్య తగ్గుతోంది. ఉదయం 10గంటలకే భానుడు భగభగమంటుండటంతో చిన్నారులు బయటకు రాలేకపోతున్నారు. మూడు నుంచి నాలుగేళ్ల చిన్నారులపై ఎండ ప్రభావం తీవ్రంగా పడుతోంది. ఎండల కారణంగా అంగన్‌వాడీ టీచర్లు కూడా ఉక్కపోత భరించలేక పోతున్నారు.

ఖమ్మం జిల్లాలో 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 958 కేంద్రాలు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. 454 కేంద్రాలు అద్దె భవనాల్లోనే నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిధిలోని భవనాల్లో 428 కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఏడు ప్రాజెక్టుల పరిధిలో ఏడు నెలల నుంచి 3 సంవత్సరాల లోపు చిన్నారులు 35,733 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 30,328 మంది అంగన్‌వాడి కేంద్రాలకు వస్తున్నారు. సొంత భవనాల్లో విద్యుత్ కనెక్షన్, ఫ్యాన్లు, తాగు నీటి సౌకర్యాలు లేవు. కేంద్రాల్లో మరుగుదొడ్లు కూడా కనిపించడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు కనీసం బాత్‌రూం సౌకర్యం కూడా లేకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న సమయాల్లో పౌష్టికాహారం ఇంటికే అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

వేసవి సెలవులు మంజూరు చేయాలి

రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. 42డిగ్రీలకు తక్కువ కాకుండా వేడిమి ఉంటుంది. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలు బయటకి వెళ్లొద్దని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఒక్కపూటే నడిపించాలని, మే నెలలో అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్తి స్థాయిలో సెలవులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

డీడబ్ల్యూవోకు వినతిపత్రం

మార్చి 15 నుంచి ప్రభుత్వ పాఠశాలలకు ఒక్కపూట స్కూల్ నడిపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని, అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కపూట కేంద్రాల నిర్వహణకు ఆదేశాలు జారీ చేయాలని శుక్రవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డికి పలువురు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు వినతిపత్రం అందించారు. మే ఎండల తీవ్రతను బట్టి నెల మొత్తం సెలవులు మంజూరు చేయాలని, రంజాన్ మాసం కావటంతో ముస్లిం టీచర్లకు హాఫ్‌డే అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



డీడబ్ల్యూవోకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

జాతీయ రహదారిపై మృతదేహంతో ఆందోళన

- అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందిన లక్ష్మీనారాయణ
- సైలోబంకర్ కాలుష్యం వల్లే కన్నుమూశాడంటున్న గ్రామస్థులు



మృతదేహంతో రోడ్డుపై ఆందోళన చేస్తున్న గ్రామస్థులు, ఇన్‌సెట్‌లో లక్ష్మీనారాయణ(ఫైల్)

సత్తుపల్లిరూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. సైలోబంకర్ కారణంగానే మృతి చెందాడంటూ ఆరోపిస్తూ గ్రామస్థులు మృతదేహంతో జాతీయ రహదారిపై ఆందోళన చేసిన సంఘటన సత్తుపల్లి మండలం కిష్టారంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పిల్లి లక్ష్మీనారాయణ(48) కూలి పనులకు వెళ్తూ భార్య అనసూర్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. గ్రామస్థులు రెండు వారాలుగా గ్రామంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న లక్ష్మీనారాయణ వారం క్రితం శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది పడుతూ ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది స్వగ్రామానికి నాలుగు రోజుల క్రితం వచ్చాడు. ఆ తర్వాత గురువారం అనారోగ్య సమస్య ఎక్కువ కావడంతో పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు.

కిష్టారంలో అరగంటపాటు ఆందోళన

గ్రామంలోని సైలోబంకర్ నుంచి వెలువడే కాలుష్యం కారణంగానే లక్ష్మీనారాయణ మృతి చెందాడంటూ ఆరోపిస్తూ గ్రామస్థులు కిష్టారంలోని జాతీయ రహదారిపై మృతదేహాన్ని ఉంచి ఆందోళనకు దిగారు. సుమారు అరగంట పాటు ఆందోళన సాగగా సత్తుపల్లి పట్టణ సీఐ టి. కిరణ్, రూరల్ సీఐ ముత్తిలింగం సిబ్బందితో గ్రామానికి చేరుకుని గ్రామస్థులను సముదాయించే ప్రయత్నంచేశారు. వారంతా ససేమిరా అనడంతో సింగరేణి అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో గ్రామ సమస్యను పరిష్కరిస్తారని సీఐ కిరణ్ హామీ ఇవ్వడంతో ఆందోళనను గ్రామస్థులు విరమించారు.

ఎల్లుండి నుంచి ఎంవీఐ కార్యాలయం పనిచేస్తుంది

- అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అశ్వారావుపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 'అశ్వారావుపేటలో ఎంవీఐ కార్యాలయం ఉన్నట్టా? లేనట్టా?' అనే శీర్షికతో శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పందించారు. నియోజకవర్గ ప్రజలకు ఎంతో అవసరమైన ఎంవీఐ కార్యాలయం నెలన్నరరోజులుగా తెరుచుకోవడం లేదని కథనం ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే జిల్లా రవాణాశాఖ అధికారులను వివరణ కోరారు. ఈ ప్రాంతానికి చెందిన వందలాది వాహనదారులను కొత్తగూడెం రప్పించడం భావ్యం కాదని, తక్షణమే పునరుద్ధించాలని ఆయన అధికారులను కోరారు. అశ్వారావుపేటలో కంప్యూటర్‌లు పాడయ్యాయని, సోమవారంకల్లా మరమ్మతులు పూర్తి అవుతాయని, వచ్చే వారం నుంచి అశ్వారావుపేటలో ఎంవీఐ కార్యాలయం పనిచేస్తుందని అధికారులు చెప్పినట్టు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ప్రజలకు ఏ విధమైన సమస్య వచ్చిన తన దృష్టికి నేరుగా తేవచ్చునని ఆయన తెలిపారు.

భక్తుల రద్దీ ఉండే ప్రాంతాల్లో మరుగుదొడ్ల పనులు వేగవంతం చేయాలి

- ఐటీడీఏ పీవో బి.రాహుల్



ప్రజలతో మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి, పట్టాభిషేకానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ముఖ్య కూడళ్లలో భక్తులు అధికంగా బస చేసే ప్రదేశాల్లో తాత్కాలిక, శాశ్వత నిర్మాణం చేపట్టే మరుగుదొడ్ల పనులు వేగవంతం చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. శుక్రవారం కాసా రామలక్ష్మి, బస్టాండు, జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, పార్కు పక్కనున్న తాత్కాలిక, శాశ్వతంగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ భక్తులు బస చేసే ప్రదేశాల్లో నీటి సమస్య రాకుండా టాయిలెట్లు నిర్మించాలని, స్నానాలు గదులు కూడా అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామ పంచాయతీ ద్వారా నిర్మాణం చేపడుతున్న సులభ కాంప్లెక్సు, తాత్కాలిక మరుగుదొడ్ల పనులు ఈ నెల 25 వరకు పూర్తి కావాలని తెలిపారు. అనంతరం ఏఎంసీ కాలనీ, మనుబోతుల చెరువు ప్రాంతాల్లో ఉన్న డుబల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించి అక్కడ నివసిస్తున్న కుటుంబాలతో వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర్, డీఈ హరీష్, మిషన్ భగీరథ ఏఈఈ నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదివాసీలకు సౌకర్యాల కల్పనే లక్ష్యం

- ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి వాలీబాల్ పోటీలు ఈ నెల 5వ తేదీన ప్రారంభం కాగా శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భద్రాచలం ఎస్పీ విక్రాంత్ కుమారింగ్ ఐపీఎస్ పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగిన ఈ మండల స్థాయి వాలీబాల్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర సరిద్దులోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఏజెన్సీ గ్రామాలనుంచి వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో మొత్తం 56 టీంలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు గా సుందరయ్యకాలనీ, పెద్దఉట్లపల్లి జట్ల మధ్య సాగిన మ్యాచ్‌ను ఆసక్తితో తిలకించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆటలు క్రీడాకారుల మానసిక ఉల్లాసాని దోహదపడతాయన్నారు ఏజెన్సీ ప్రాంతాలనుంచి యువత క్రీడల్లో జాతీయస్థాయి వరకు చేరుకుని ఈ ప్రాంతానికి, జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆదేశించారు. ఈవాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారిన అభినందించారు. తెలంగాణ , ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే యువకులు అధిక సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు.

అనంతరం ఈ పోటీలో ప్రథమ బహుమతిని చీమలపాడు, ద్వితీయ సుందరయ్యకాలనీ, తృతీయ పెద్దుట్లపల్లి, నాల్గో బహుమతి గెలుచుకున్న మామిడిగూడెం జట్లకు ఎస్పీ బహుమతులను అందజేశారు. ఈ వాలీబాల్ పోటీలు ఘనంగా ఏర్పాటు చేసిన చర్ల పోలీసులను, సహకరించిన పీడీ, ఈఈటీలకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

గడువులోగా పనులను పూర్తిచేయాలి

- పంచాయతీరాజ్ శాఖ పనులపై సమీక్షించిన జడ్పీ సీఈవో



ఎంపీడీవోలతో సమీక్షిస్తున్న జడ్పీ సీఈవో దీక్షరైనా

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జడ్పీ సీఈవో దీక్షరైనా ఆదేశించారు. శుక్రవారం డీపీఆర్సీ భవనంలో డీఆర్డీవో, డీపీవోతో కలిసి ఏపీడీలు, మండలపరిషత్ అధికారులు, ఏపీవోలతో ఆమె సమీక్షించారు. ఈసందర్భంగా ఎన్నార్ఈజీఎస్, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఉపాధికూలీలకు అమలు చేస్తున్న పనులతో పాటు గ్రామపంచాయతీల్లో పన్నుల వసూళ్లు, అమ్మ ఆదర్శ పాఠశాలలు, 15వ ఆర్థిక సంఘం నిధులు, వాటి ఆడిట్ అబ్జక్షన్లపై ఆమె సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సన్యాసయ్య, డీపీవో ఆశాలత, డీఎల్పీవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఫలితాల విడుదల

కొత్తగూడెం అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జనవరి నెలలో జరిగిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ (టీసీసీ) ఫలితాలు విడుదల అయినట్లు డీఈవో వెంకటేశ్వరచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఫలితాలను, మార్కుల మెమోలను వెబ్‌సైట్‌లో అభ్యర్థి హాల్‌టికెట్, డేట్ ఆఫ్ బర్త్ ఎంటర్ చేసి పొందాలని తెలిపారు. త్వరలో పాస్ సర్టిఫికెట్లు జిల్లాకు చేరుకుంటాయన్నారు.

డీఎల్ఈడీ పరీక్ష ఫలితాలు విడుదల..

డిసెంబరు 2024లో జరిగిన డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ప్రథమ సంవత్సర ఫలితాలు విడుదల అయినట్లు డీఈవో వెంకటేశ్వరచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫలితాలను, మార్కుల మెమోలను వెబ్‌సైట్‌లో అభ్యర్థి హాల్‌టికెట్, డేట్ ఆఫ్ బర్త్ ఎంటర్ చేసి పొందాలని తెలిపారు. త్వరలో ఈ పాస్ సర్టిఫికెట్లు జిల్లాకు చేరుకుంటాయన్నారు.

మొక్కలు నాటిన న్యాయాధికారి శివనాయక్



మొక్క నాటుతున్న దృశ్యం

భద్రాచలం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ప్రథమశ్రేణి న్యాయస్థానం ఆవరణలో శుక్రవారం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్ మొక్కలు నాటారు. భద్రాచలం, బూర్గంపాడు పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన ముద్దాయిలకు జరిమానాతో పాటు కమ్యూనిటీ సర్వీసులో భాగంగా మొక్కలు నాటాలని ఆయన సూచించారు.

ఉద్యోగుల బిల్లుల పరిష్కారంపై డిప్యూటీ సీఎం భట్టికి అభినందనలు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల, పెన్షనర్ల పెండింగ్ బిల్లులు పరిష్కారానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కార్యాచరణను ప్రకటించడం పట్ల జేఏసీ నాయకులు ఏలూరి శ్రీనివాస్, ఎస్టీఎఫ్ నాయకులు దేవరకొండ సైదులు సత్కరించారు. డిప్యూటీ సీఎంను సెక్రటేరియట్‌లో ఆయన చాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల బిల్లులు పరిష్కారం కోసం ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని పాలనను సమర్థవంతంగా నిర్వహించేలా రూ 600 కోట్లు చెల్లించేందుకు మంజూరి చేస్తున్నట్లు భట్టి ప్రకటించినట్లు తెలిపారు. ఉద్యోగుల జేఏసీ నాయకులు భట్టికి కృతజ్ఞతలు తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్



స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న దశ్యం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్ హెచ్చరించారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే నేరమన్నారు. పీసీపీఎన్‌డీటీ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా సిబ్బంది అర్హతలను పరిశీలించారు. ఎఫ్ ఫార్మ్‌పై ఆడిట్ నిర్వహించి, స్కానింగ్ సెంటర్స్‌కు పలు సూచనలు చేశారు. అర్హత కలిగిన వారే స్కానింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో ఫైజ్ మొహిద్దీన్, డాక్టర్ ఆర్‌పీ చైతన్య, డీపీఎంవో పాయం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల సాగునీటి కలను సాకారం చేసిన తుమ్మల

- ఆయురారోగ్యాలతో ఉండాలని పాదయాత్ర
- విజయవాడ కనకదుర్గ సన్నిధికి పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న భక్త బృందం

ములకలపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ములకలపల్లి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన 37మంది గ్రామస్థులు శుక్రవారం రామచంద్రాపురం నుంచి విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధికి పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా భక్త బృందం సభ్యులు మాట్లాడుతూ దశాబ్ధాల సాగునీటి కలను సీతారామ ప్రాజెక్టులో సాకారం చేసిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయురారోగ్యాలతో ఉండాలని కృతజ్ఞతలు పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు. ఈ భక్త బృందం సునీత, తిమ్మిని అనుష, రేనట్ల నాగయ్య, తిమ్మిని చెన్నకేశవరావులు, బొమ్మకంటి మధ, బాల్దా శ్రీను తదతరులు పాల్గొన్నారు.



570 మంది విద్యార్థుల గైర్హాజరు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఆంగ్ల పరీక్ష నిర్వహించారు. జనరల్ విద్యార్థులు 15842 మందికి 15461 మంది పరీక్షలకు హజరుకాగా, 381 మంది గైర్హాజరు, ఓకేషనల్ విద్యార్థులు 2378 మందికి 2189 మంది హజరుకాగా 189 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరు. మొత్తం 18220 మంది విద్యార్థులకు 17650 మంది విద్యార్థులు పరీక్షకు హజర్రై, 570 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె రవిబాబు తెలిపారు.

సీపీఐ నేతకు మాతృ వియోగం

రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి నివాళి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పొంగులేటి

ఖమ్మం రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ మండలం, పల్లెగూడెం గ్రామానికి చెందిన సీపీఐ మండల కార్యవర్గ సభ్యుడు లింగా వెంకటనారాయణ తల్లి లింగ మల్లమ్మ (85) శుక్రవారం గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాళులర్పించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, జిల్లా పార్టీ ఆధ్వర్యంలో ఆమె భౌతిక కాయంపై ఎర్రజెండాను కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లింగా వెంకటనారాయణ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాడ సానుభూతి తెలిపారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటరెడ్డి, కేతినేని వేణు, బీఆర్ఎస్ నాయకులు డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, మండలాధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, వెంకటరెడ్డి, సీపీఐ నాయకులు మండల కార్యదర్శి సుధాకర్, సిద్దినేని కర్ణకుమార్, చిన్న వెంకటరెడ్డి, కమలాకర్, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు గుర్రం అచ్చయ్య, మలీదు నాగేశ్వరరావు, బందెల వెంకయ్య, రెంటాల యాదగిరి, సీపీఎం నాయకులు మండల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, నండ్రా ప్రసాద్, నందిగామ కృష్ణ, లాల్‌బాబు, తదితరులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

భట్టి పీఏ కుటుంబానికి పరామర్శ

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పీఏ తక్కిళ్లపల్లి శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. శ్రీనివాస్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు కిషోర్ రెడ్డి, మద్ది వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు నిధులు మంజూరు

కూసుమంచి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కూసుమంచిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. రూ.5.50 కోట్లు మంజూరు చేస్తూ ఉన్నతవిద్యామండలి ఉత్తర్వ్యులు జారీచేసింది. రూ.5కోట్లను నూతన భవననిర్మాణానికి, రూ.25లక్షలను ల్యాబ్ పరికరాల కొనుగోలుకు, కంప్యూటర్లు, ఆఫీస్ పరికరాల కొనుగోలుకు మరో రూ.25 లక్షలు మొత్తంగా రూ.5.50కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వ్యుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం రెవిన్యూ అకాడమీ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే పక్కనే ప్రభుత్వ స్థలంలో త్వరలో నిర్మాణం చేపట్టనున్నారు. నిధులు మంజూరు కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళల హక్కులు పరిరక్షించాలి

ఖమ్మం చర్చికంపౌండ్ మార్చి7(ఆంధ్ర జ్యోతి): మహిళల హక్కుల పరిరక్షించాలని ప్రముఖ వైద్యురాలు ఎలమంచిలి నాగమణి అన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మహిళా హక్కుల పరిరక్షణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మహిళలు వివిధ రంగాల్లో వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయరాదని, పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లోనూ రాణించి తమ సత్తాచాటాలన్నారు. ఈ సదస్సులో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బండి పద్మ, మెరుగు రమణ, రమ్య, బేగం, అమరావతి తదితరులు పాల్గొన్నారు,

మహిళల ముందడుగుతోనే సమానత్వం

ఖమ్మం చర్చికాంపౌండ్, మార్చి7(ఆంధ్రజ్యోతి): మహిళల ముందడుగుతోనే సమాజంలో మహిళలకు సమానత్వంతో పాటు వారి సాధాకారిత సాధ్యమవుతుందని ప్రముఖ వైద్యురాలు స్వర్ణకుమారి అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని ఓ హోటల్‌లో వీరనారీమణుల ఆశయసాధన సమితి ఆధ్వర్యంలో ముందస్తుగా అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగం... బహుజన మహిళల సాధికారత అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణకుమారి మాట్లాడుతూ మహిళలు అంటే చిన్నచూపుగా భావించే సమాజంలో మనం అధైర్యపడకుండా ముందుకు సాగాలని తెలిపారు. తొలుత వీరనారీమణుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సదస్సులో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రునాయక్, వీరనారీమణుల ఆశయసాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రబాయి, త్రివేణి, జ్యోతి, స్పందన, విజయ, ఝాన్సీ, పెద్దపాక విజయ్, రవీందర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

అవాంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి

కూసుమంచి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎటువంటి అవాంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి ఆదేశించారు. శుక్రవారం కూసుమంచి మండలం పాలేరులో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను, మిషన్ భగీరథ ప్లాంట్‌ను సందర్శించారు. సంబంధిత విద్యుత్ మోటార్ల ట్రాన్స్‌పార్మర్లను, లైన్లను, విద్యుత్ సరఫరా పరిస్థితిని పరిశీలించి సమీక్షించారు. అనుకోకుండా ఏదైన సరఫరాలో అవాంతరాలు ఎదురైతే సబ్‌స్టేషన్‌లో సిద్ధంగా ఉన్న ప్రత్నామ్నాయ లైన్ల నుంచి సరఫరా అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ కోక్యానాయక్, పాలేరు ఏఈ ధాపూర్యానాయక్, సిబ్బంది పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేలకొండపల్లి, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తకొత్తూరు విద్యుత్ సబ్-స్టేన్‌లో మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కుక్కల రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తకొత్తూరు సబ్-స్టేషన్ పరిధిలోని నేలకొండపల్లి, కొత్తకొత్తూరు, పాతకొత్తూరు, తిరుమలాపురం, పైనంపల్లి, బోదులబండ, రామచంద్రాపురం, అనంతనగర్, కోరట్లగూడెం గ్రామాల్లో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ రామారావు కోరారు.

మహాసభలను విజయవంతం చేయండి

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న హైదరాబాదులోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 17వ అఖిల భారత పద్మశాలి మహాసభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభలు జరుగుతున్నాయని ఈ సభలను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మహాసభలకు ముఖ్య అతిధిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పద్మశాలీలు భారీ సంఖ్యలో పాల్గొని పద్మశాలీల ఐక్యత చాటాలని కోరారు.

ముగిసిన మేయర్ బృందం పుణె పర్యటన

చివరి రోజు పారిశుద్ధ్యం, ఇంటింటి వ్యర్థాల సేకరణ, శుద్ధిపై పరిశీలన

బయో గ్యాస్, సేంద్రియ ఎరువులు, వ్యర్థాలతో పేపర్ ముడి సరుకు కేంద్రాల పరిశీలన

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పలు రంగాల్లో రాష్ట్రంలోనే అభివృద్ధి కార్యక్రమాలను ఆదర్శంగా అమలు చేస్తున్న ఖమ్మానికి పారిశుద్ధ్యం, డంపింగ్ వంటి కొద్ది సమస్యలు మాత్రం ఇబ్బందిగా ఉన్నాయి. దీంతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య కార్యచరణతో మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, కేఎంసీ అధికారులు పుణెలో రెండో రోజు శుక్రవారం స్టడీ టూర్ పూర్తి చేశారు. తొలి రోజు ఇంజనీరింగ్, పరిపాలన పరమైన అంశాలను పరిశీలించగా రెండో రోజు పారిశుద్ధ్యం, ఇంటింటి చెత్త సేకరణ, రవాణా, చెత్త శుద్ధి వంటి నూతన అంశాలను బృందం సభ్యులు పరిశీలించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా పర్యటన కొనసాగించారు.

మహిళ, ఎన్జీవో సంస్థల ద్వారా

పుణె మహానగరంలో మహిళా మరియు స్వచ్ఛ కోఆపరేటీవ్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో రోజుకు 1,300 మెట్రిక్ టన్నులు ఇంటింటి చెత్త సేకరణ జరుగుతోంది. ఆయా వ్యర్థాల నుంచి పేపరు, ఎరువుల ఏరువులు, బయో గ్యాస్, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు.

రెండు విధాలుగా ఆర్థిక లాభం

మహిళా సంఘాలు ఇంటింటి చెత్త సేకరణలో రెండు రకాల ఆర్థిక లాభాలు పొందుతున్నారు. ప్రతి ఇంటి నుంచి నెలకు రూ.65 నుంచి రూ.85 వసూళ్ల చేస్తున్నారు. మరో వైపు చెత్తలోని ప్లాస్టిక్, కూరగాయలు, ధన, ద్రవ, ఇతర వ్యర్థాలను విడివిడిగా శుద్ధి కేంద్రాల ద్వారా అమ్మకాలు జరుపుతున్నారు. దీంతో ఒక్కో మహిళకు నెలకు రూ.23వేల నుంచి రూ.25 వేల వరకు ఆదాయం పొందుతున్నారు.

ప్రతి ఫంక్షన్ హాల్‌లో చెత్త శుద్ధి కేంద్రాలు

పుణె నగరంలోని ప్రతి ఫంక్షన్ హాల్ భవనంపై చెత్త శుద్ధి కేంద్రాలు ఏర్పాటు జరుగుతున్నాయి. శుద్ధి కేంద్రాలకు అనుమతి తీసుకున్న తర్వాత ఫంక్షన్ హాల్‌కు అనుమతిలు జారీ చేస్తున్నారు. ఏ ఫంక్షన్ హాల్‌లో వచ్చే వ్యర్థాలను ఆదే ఫంక్షన్ హాల్‌లో శుద్ధి చేయాల్సి ఉంటుంది. ఫంక్షన్ హాల్స్ ఖాళీగా ఉన్న సమయంలో ఆ శుద్ధి కేంద్రాలను మహిళా సంఘాలు వినియోగిస్తున్నాయి. ఫంక్షన్ హాల్‌లో వ్యర్థాల శుద్ధి ద్వారా బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. స్థానికంగా అక్కడే వాడుకుంటున్నారు.

పొడి వ్యర్థాల రీ సైక్లింగ్‌తో

పుణె నగరంలో ఏ రోజు పొడి వ్యర్థాలను ఆదే రోజు శుద్ధి చేసి వాటి నుంచి వచ్చే పదార్థాలను పేపరు పరిశ్రమలకు పంపుతున్నారు. ప్లాస్టిక్‌ను ఆయా కంపెనీలకు ముడి పదార్థాలుగా అమ్మకాలు చేస్తున్నారు. అన్ని రకాల వ్యర్థాలను హమాలీల అవసరం లేకుండా మిషన్లు బంకర్లకు రవాణా చేస్తున్నారు.

తడి వ్యర్థాల ద్వారా బయో గ్యాస్

కూరగాయల నుంచి అన్ని రకాల తడి వ్యర్థాలను ఏ రోజుకారోజు శుద్ధి చేసి వాటి నుంచి బయో గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నారు. గ్యాస్‌తో పాటుగా విద్యుత్ గ్యాస్ ప్లాంట్‌లను నిర్వాహణ చేస్తున్నారు. సేంద్రియ ఏరువులను తయారీ చేస్తున్నారు. కూరగాయల వ్యర్థాలతో బయో గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఈ గ్యాస్‌ను రవాణా ఆటోలు, వాహనాలకు వినియోగిస్తున్నారు.

పుణె ప్రత్యేకత ఇదే..

గత 75ఏళ్లుగా పుణె మహానగరం కార్పొరేషన్‌గా ప్రజలకు సేవలు అందిస్తోంది. ప్రతి రోజు 1300 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి జరుగుతుంది. 76 విభాగాల ద్వారా మున్సిపల్ పరిపాలన కొనసాగుతుంది. పుణె నగరంలో డ్రైనేజీ నుంచి మల వ్యర్థాల వరకు అండర్ గ్రౌండ్ సిస్టమ్ అమలు చేస్తున్నారు. దీంతో డ్రైనేజీలు రహదారుల పక్కన ఎక్కడా కూడా కనిపించటం లేదు. డ్రైనేజీ వ్యర్థాల సమస్య లేక పోవటంతో తేమల తీవ్రత లేదు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నూరుశాతం అమలు జరుగుతుంది. దీంతో ప్లాస్టిక్ పారిశుద్య సమస్య రావటం లేదు. ఆధునిక విద్యుత్ పారిశుద్య యంత్రాల నిర్వాహణ, తడి, పొడి చెత్త, బయో గ్యాస్ కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ బల్క్, డ్రై వేస్ట్ కలెక్షన్, కంపోస్టింగ్, గర్బైజ్ రవాణ, వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి, ప్రతి సోమవారం సాయంత్రం 3నుంచి 5గంటల వరకు ప్రజలు రికార్డులు పరిశీలన చేసుకోవోచ్చు. జీపీఎస్ ట్రాకేర్ అమలు. కార్మికులకు ఏడాదికి రూ.2వేలు దుస్తులు, హ్యాండ్ గ్లౌవ్‌జ్‌లు తెచ్చుకోవాలి. రెగ్యూలర్ సంక్షేమానికి నిధి ఏర్పాటు, కో-ఆపరేటీవ్ విధానం అమలులో ఉంది. 50శాతం ఉద్యోగి, 50శాతం పీఎంసీ చెల్లిస్తోంది. గ్రూప్ ఇన్స్‌రెన్స్ అమలులో ఉంది. సొంతంగా పీఎంసీ నియామకం జరుగుతుంది. పీఎంసీ తర్వాత ఐదు జోన్‌లు ఉన్నాయి. ఒక్కో జోన్ పరిధిలో 15వార్డు ఆఫీస్‌లు ద్వారా పరిపాలన కొనసాగుతుంది. ప్రతి సంవత్సరం ఖాళీగా ఏర్పాడిన స్థానాల్లో ఉద్యోగాల నియామకం జరుగుతుంది. పక్కా ప్రణాళిక మేరకు నగర ప్రణాళిక జరుగుతుంతి. ప్రత శుక్రవారం స్టాండింగ్ కమిటీ సమావేశం జరుగుతుంది.



కూరగాయల వ్యర్థాలతో సెంద్రియ ఎరువుల తయారీ పరిశీలన

నిర్విరామంగా సాగిన బృందం పర్యటన

రెండో రోజు మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యంలో పుణెలో పర్యటించారు. ఉదయం 7గంటల నుంచి రాత్రి 7గంటల వరకు పుణె నగరంలోని పారిశుధ్య, ఇతర విభాగాలను పరిశీలించారు. ఏవో శివలింగం, టీపీఎస్ నరేశ్, ఎస్టాబ్లిష్‌మెంట్ ఉద్యోగులు ఆసిన్, సుజిత, మెప్మా సీవో ద్రౌపతి పుణె మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి వార్వారి విభాగాల రికార్డుల నిర్వాహణ తీరును తెలుసుకున్నారు. అసిస్టెంట్ కమిషనర్ ఆహ్మద్ షఫీ ఉల్లా, ఈఈ కృష్ణలాల్, కార్పొరేటర్లు స్టడీ టూర్‌లో పాల్గొన్నారు.

ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా అభివృద్ధి

రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, మార్చి7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయిన తల తాకట్టు పెట్టి అయినా అభివృద్ధి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం, ఆరెంపుల, పల్లెగూడెం, సత్యనారాయణపురం తదితర గ్రామాల్లో మంత్రి పొంగులేటి శుక్రవారం పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పది సంవత్సరాల్లో సాధించుకున్న తెలంగాణలో ఆనాటి ప్రభుత్వం మాటలు చెప్పింది తప్ప చేతల్లో ఏమీ లేదన్నారు. మిగిలిన కార్యక్రమాలన్నింటిని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పూర్తి చేస్తామన్నారు. అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ పేదవాళ్ళను ఆదుకోవాలని ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. రైతులకు వడ్లకు బోనస్, ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్ లాంటివి అమలు చేశామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చక్కదిద్దబెట్టి ఒక రోజు లేట్టైనా ఇచ్చిన హమీలను అన్నింటిని నిజాయితీగా చేస్తామన్నారు. రాబోయే కొద్ది రోజుల్లో విడతల వారీగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. మార్చిలోపే రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు 3,500 ఇళ్లను అందిస్తామన్నారు. గడిచిన పదేండ్లలో గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో రేషన్ కార్డులు, పెన్షన్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు బండి జగదీష్, కళ్లెం వెంకటరెడ్డి, నవీన్, రవి, దావూద్, వీరభద్రం, పంతులు నాయక్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఖమ్మం రూరల్ మండలానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు శుక్రవారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా గత నాలుగేండ్లుగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారానికి 25 శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపునకు కొత్త జీవో తీసుకువచ్చి రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి మంత్రి పొంగులేటి జీవం పోసినట్లు రియల్ ఎస్టేట్ సంఘం అధ్యక్షులు కృష్ణమోహన్, గౌరవ అధ్యక్షులు గరికపాటి ఆంజనేయ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతు ఎల్ఆర్ఎస్‌లో ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నా వాటిని వెంటనే పరిష్కరిస్తానని హమీ ఇచ్చారు. అనంతరం మంత్రి పొంగులేటిన రియల్ వ్యాపారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రియల్ వ్యాపారులు కారం శ్రీనివాస్, నాగేశ్వరరావు, రామకృష్ణ, వీరన్న, కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కూసుమంచి: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా పనిచేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. కూసుమంచిలో మహిళా సంఘానికి మంజూరు చేసిన రూ.10లక్షల విలువైన సంచారచేపల విక్రయకేంద్రాన్ని కలెక్టర్‌తో ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇందిరా మహిళాశక్తి కార్యక్రమం ద్వారా వివిధ వ్యాపార యూనిట్లను ఏర్పాటు చేసి మహిళల స్వాలంబన దిశగా కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి శివప్రసాద్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, అదనపు డీఆర్డీవో నూరొద్దిన్, అధికారులు పాల్గొన్నారు.

పార్టీ విస్తృతికి కృషిచేయాలి: బాగం

ఖమ్మం చర్చికంపౌండ్ మార్చి7(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ విస్తృతికి ప్రతీ కార్యకర్త కృషిచేయాలని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఆ పార్టీ జిల్లాకార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని సంస్థాగతంగా బలో పేతంచేయాలని కార్యకర్తలకు సూచించారు. దీనిలో భాగంగా ఏప్రిల్ 15నాటికి గ్రామ, మండల కమిటీల నియామకం చేసి డిసెంబర్ 26న జిల్లా పార్టీ శాతాబ్ది ఉత్సవాల ముగింపు సభ నిర్వహించాలని కార్యచరణ సూచించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురుష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలపై సదస్సు

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి7(ఆంధ్రజ్యోతి): ఆకాంక్ష ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం నగరంలో బల్లేపల్లిలోని కిన్నెర నర్సింగ్‌కాలేజీలో మానవతా విలువలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా అన్నం ఫౌండేషన్ ఛైర్మన్ అన్నం శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ప్రతి ఒక్కరు మంచిగా చదువుకుని సమాజానికి తోడ్పాటు అందించాలన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకురాలు ప్రతిభారెడ్డి, వంగూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ సందర్భంగా ప్రత్యేక నమాజ్‌లు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ముస్లీంలు ప్రత్యేక నమజ్‌లు నిర్వహిస్తున్నారు. రంజాన్ మాసంలో మొదటి శుక్రవారం కావటంతో ముస్లీంలు అధిక సంఖ్యలో మసీదుల్లో నమాజ్‌లు నిర్వహించారు. ఈ మాసంలో రోజుకు ఐదు సార్లు నమాజ్ తోపాటు ప్రత్యేక నమాజ్‌లో పాల్గొంటారు. శుక్రవారం నగరంలోని పలు మసీద్‌లలో ముస్లీంలు నమాజ్‌లకు హాజరయ్యారు. దీంతో మసీదులలో ముస్లీం మత పెద్దలతో పండుగ వాతావరణం కనబడుతోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న మసీదుల వద్ద సందడి వాతావరణం కనపడింది.

టీసీసీ ఫలితాలు వెబ్‌సైట్‌లో

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 7(ఆంధ్రజ్యోతి): జనవరి 2025లో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్(టీసీసీ)పరీక్షా ఫలితాలు విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పరీక్ష రాసిన వారు ఫలితాలను పరిశీలించుకోవాలని కోరారు.

లింగ సమానత్వం సాధించాలి

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చిన లింగ సమానత్వం 2030 నిజం చేయాలంటే మనమందరం ఐక్యంగా కృషి చేయాలని బాలల సంక్షేమ కమిటటి ఛైర్‌పర్సన్ భారతీరాణి అన్నారు. శుక్రవారం నగరంలోని మహిళా ప్రాంగణంలో మహిళా దినోత్సవం సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి ఆమే హజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వేల్పుల విజేత, పోలీస్ విభాగం భాద్యులు నరసింహారావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 20 మంది గైర్హాజర్

నేలకొండపల్లి, మార్చి(ఆంధ్రజ్యోతి): శుక్రవారం జరిగిన ఇంటర్మీడియేట్ పరీక్షకు మొత్తం 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో మొత్తం 182మంది విద్యారులు పరీక్ష వ్రాయాల్సి ఉండగా 178మంది మాత్రమే హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని పరీక్షల అధికారి కిరణ్ చెప్పారు. సింగారెడ్డిపాలెం గురుకుల బాలికల కళాశాలలో 221 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 205మంది విద్యార్థులు హాజరైనట్లు, 16మంది పరీక్షలకు హాజరు కాలేదని అధికారి పద్మావతి చెప్పారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

తిరుమలాయపాలెం, మార్చి7(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో అబివృద్ధి చెందుతూ ఆర్థికాభావ్రిద్ధి సాధించాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ రమాకుమారి తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్బంగా కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. మహిళలు వంటింటికి పరిమితం కాకుండా అన్నిరంగాల్లో రాణించనప్పుడే దేశం అభివృద్ధి చెందతుదన్నారు. మహిళలు తమ శక్తిసామర్థ్యాలను నిరూపించుకుని అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి మంగతాయి, దొండేటి సుగుణమ్మ, బింగి నాగమణి, ఇప్పల పుష్పావతి, రావుల నాగలక్ష్మి, శిరీష, సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపు మహిళా దినోత్సవం

నేలకొండపల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి భక్తరామదాసు సర్వీస్ సొసైటీ, నేలకొండపల్లి సేవా మహిళా మండలి ఆధ్వర్యంలో ఈ నెల 9న నేలకొండపల్లి వాసవీభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 9వతేదీ ఆదివారం ఉదయం 9గంటలకు సంవత్సరం లోపు చిన్నారులకు వెల్ బేబీషో నిర్వహిస్తారు. 10గంటలకు ఖోఖో, 11గంటలకు పాటల పోటీలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2గంటలకు మహిళా సదస్సును నిర్వహిస్తారు. సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి వెంకటరామారావు అధ్యక్షతన సదస్సు జరుగుతుందన్నారు.



పిల్లల చదువుపై అవగాహన కలిగి ఉండాలి

» ప్రిన్సిపాల్ డాక్టర్ నంద్రు గోపి

సత్తుపల్లి, మార్చి7 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు వచ్చే విద్యార్థులైన తమ పిల్లల హాజరు శాతంతో పాటు చదువుపై తల్లీదండ్రులు అవగాహన కలిగి ఉండాలని జేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నంద్రు గోపి అన్నారు. శుక్రవారం కళాశాలలో జ్ఞానదత్తత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధి కమిటీ కన్వీనర్ డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఎన్నో ఆశయాలతో నిర్మించిన ఈ కళాశాలలో ఇలాంటి కార్యక్రమం తెలుగు రాష్ట్రాలలో చేపట్టడం ఇదే మొదటిసారి అని, తల్లీదండ్రులను సైతం భాగస్వామ్యం చేయడం అభినందనీయమన్నారు. ఆ విద్యార్థుల జ్ఞానాన్ని దత్తత తీసుకుని భవిష్యత్‌లో వారిని ఉన్నత స్థానాల్లో నిలబెట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీ డీపీవో కనకదుర్గ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌కే.పీర్‌సాహెబ్, అధ్యాపకులు డాక్టర్ బాలకృష్ణ, మహేష్, డాక్టర్ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలతో పంటలు సస్యశ్యామలం

» ఎమ్మెల్యే రాగమయి



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, మార్చి7 (ఆంధ్రజ్యోతి): సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలను అనుసంధానం చేయడంతో సత్తుపల్లి నియోజకవర్గం ప్రాంతంలో వేలాది ఎకరాల రైతుల భూములు సస్యశామలం కానున్నాయని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. శుక్రవారం కల్లూరులోని సాగర్ ఎడమకాల్వపై కప్పలబంధం 72 కిమీ రెగ్యులేటర్ వద్ద గోదావరి జలాల రాకతో రైతులతో కలిసి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆయకట్టుకు సాగునీరు నిరంతరం అందేలా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ మోడల్ ఇంటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, జిల్లేళ్ల కృష్ణ రెడ్డి, కొండపల్లి శ్రీమన్నారాయణ, భాగం ప్రభాకరచౌదరి, ఏనుగు సత్యంబాబు, జలవనరుల శాఖ ఈఈ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సత్తుపల్లిలో...

సత్తుపల్లి, మార్చి7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సొంతింటి కల నెరవేర్చే క్రమంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల చారిత్రాత్మక నిర్ణయమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శుక్రవారం సత్తుపల్లి మండలం కొత్తూరులో 102మంది లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులను గ్రామస్థులు కొప్పుల నరేందర్‌రెడ్డి, గొర్లమారి రామ్మోహన్‌రెడ్డిలు ఘనంగా సన్మానించారు. అనంతరం ఇటీవల మృతిచెందిన ఫొటోగ్రాఫర్ పసల రాము కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెలంగాణ ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం, వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సేకరించిన రూ.1.90లక్షల చెక్కును ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. అదేవిధంగా జేవీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జ్ఞానదత్తత కార్యక్రమంలో పాల్గొని ప్రిన్సిపాల్ డాక్టర్ నంద్రు గోపి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనకదుర్గలతో కలిసి ప్రసంగించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

కమీషన్లపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు

» జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న కమల్‌రాజు

మధిరటౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): కమీషన్లు వచ్చే పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు కానీ, మధిరలో పనులు పూర్తి అయిన వంద పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవానికి పాలకులకు సమయం దొరకడం లేదని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆరోపించారు. శుక్రవారం మధిరలో సంవత్సరం క్రితం పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వంద పడకల ఆసుపత్రి వద్ద ఆయన పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అక్కడ 50 పడకల ఆసుపత్రి తెచ్చాం, ఇక్కడ ఇది తెచ్చాం అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు పూర్తయిన ఆసుపత్రిని ఎందుకు ప్రారంభించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ రూరల్, పట్టణ కార్యదర్శులు బొగ్గుల భాస్కర్ రెడ్డి, అరిగె శ్రీను, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వై.వి. అప్పారావు, కౌన్సిలర్ ఇక్బాల్, వంకాయలపాటి నాగేశ్వరరావు, ప్యారి, కటికల సత్యనారాయణ రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల వితరణ

మధిరటౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): మధిర సీపీఎస్ ప్రభుత్వ ఉన్నత పా రశాలలో పదో తరగతి విద్యార్థులకు మధిరకు చెందిన వ్యాపారవేత్త పుల్ల ఖండం సత్యనారాయణమూర్తి శుక్రవారం పరీక్ష ప్యాడ్‌లు వితరణ చేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ పద్మావతి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పదేళ్లుగా సత్యనారాయణ పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే మధిరలోని అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్యాడ్లు అందజేయడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపీడీవో నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హరిప్రసాద్‌ను పరామర్శించిన ఎంపీ



నాగమణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ముదిగొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సతీమణి నాగమణి ఇటీవల మృతిచెందగా ఆమె చిత్రపటానికి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్‌ను వారు పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

10న జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

సత్తుపల్లిరూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్య తీరును వ్యతిరేకిస్తూ ఈనెల 10న జీఎం కార్యాలయం ఎదుట ధర్నా తలపెట్టినట్లు సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు సముద్రాల సుధాకర్, కిషోర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కిష్టారం ఓసీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడుతూ వీకే ఓసీ ప్రయివేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భరణి, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, మోహనమురళీ, వీవీ.రమణ, అల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ వర్కర్లకు వేతనాలు చెల్లించాలి



ఎంపీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ వర్కర్లు

కారేపల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం నెల నెలనెల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ కమిటీ మండల కార్యదర్శి కె.నరేందర్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవోకు కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

సాగు నీటి సరఫరాలో ప్రభుత్వం విఫలం

» సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి గోపాల్‌రావు

చింతకాని, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సాగు నీటి సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇదిగో అదిగో అని ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాచబంటి రాము, వత్సవాయి జానకిరాములు, నకనబోయిన కృష్ణమూర్తి, గడ్డం కోటేశ్వరరావు, దేశబోయిన ఉపేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌రావు

సాంకేతిక అనుమతుల కోసం కృషి చేయాలి

» రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా, మార్చి7(ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రా జెక్టును పూర్తి చేయుటకు కేంద్ర సాంకేతిక సలహామండలి అభ్యంతరాలను నివృతి చేసి సీతరామ ఎత్తిపోతల పథకం, సీతమ్మ బారేజి తక్షణమే పూర్తిచేయుటకు అవసరమైన 10 వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం 2025-26బడ్జెట్లో కేటాయింపులు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శక్రవారం వైరా మండలం గోల్డెన్ పాడ్ గ్రామంలో తెలంగాణ రైతు సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరి జలాలు తరలింపు కోసం ఖమ్మం జిల్లా ప్రజలు అనేక ఉద్యమాలు చేసిన చరిత్ర ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి కిలారు శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీపీ బొంతు సమత, కొణెదల కోటేశ్వరరావు, నల్లమోతు వెంకటనారాయణ, వయమా చిన్న సత్యనారాయణ, అమరనేని వెంకటేశ్వరరావు, వెంపటి రాజా, ఆళ్ళ శ్రీనివాస్, కంచర్ల శ్రీనివాస్‌రావు, రాజేంద్రప్రసాద్, ధర్మారావు, వడ్లమూడి మధు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పును తగ్గించాలి

చింతకాని, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పొద్దుటూరు- రావినూతల ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో రోడ్డు వెడల్పును తగ్గించాలని రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న రైతులు శుక్రవారం ఎంపీ రఘురాంరెడ్డిని కలసి వినతిపత్రం సమర్పించారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు పూర్తిగా ధ్వంసమైతున్నాయని, బోర్లు, బావులు కోల్పోతున్నామని పేర్కొన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

చేతిపంపు ప్రారంభం

చింతకాని, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎస్సీ కాలనీలో తాగునీటి అవసరాల కోసం గ్రేస్ సర్వీస్ సొసైటీ ఖమ్మం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతి పంపును పాస్టర్ ఎర్నెస్ట్ పాల్, బర్మా బాస్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారపోగు కొండల్‌రావు, నరేష్, జాన్, శేఖర్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విజయోత్సవ సభలకు పీఆర్టీయూ శ్రీకారం

వైరా, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఎన్నికల్లో విజయం సాధించిన పీఆర్టీయూ మాజీ అధ్యక్షులు పింగిళి శ్రీపాల్‌రెడ్డి విజయాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని పాఠశాలలు తిరుగుతూ విజయోత్సవాలు జరపాలని జిల్లా సంఘం అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం వైరాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి ఓటు వేసి గెలిపించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో వెలిశెట్టి నరసింహారావు, మాధవరావు, చంద్రశేఖరరెడ్డి, సీతారామారావు, రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా సాగర్ జలాలు సరఫరా చేయాలి

వైరా, మార్చి7(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎస్‌పీ రాపల్లి మేజరు ఆయకట్టు పరిధిలో ఉన్న అష్టగుర్తి, గొల్లెనపాడు, వల్లాపురం గ్రామాలలో సాగు చేసిన మొక్కజోన్న ఇతర ఆరుతడి పంటలకు నీటిగండం ఏర్పడింది. శుక్రవారం వైరా తహసీల్దార్ కె.వి శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి మయాన్ మింజుఖాన్‌లు అష్టగుర్తి గ్రామంలో పంటలను పరిశీలించారు. గ్రామ రైతులతో మాట్లాడారు. గత శనివారం వరకు నీరు విడుదల చేశారని కాని ఎండల తీవ్రతకు మొక్కజోన్న పంటకు తక్షణం నీరు అవసరమన్నారు. ఈసందర్భంగా వారు వైరా నీటిపారుదలశాఖ డీఈ శ్రీనివాస్‌రావుతో ఫోన్‌లో మాట్లాడి శనివారం నుంచి వైరా ప్రాజెక్ట్ నీటిని విడుదల చేయించేందుకు ఒప్పించారు. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి

తల్లాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎండల్లో బయటకు రావొద్దని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఐ.రత్నమనోహర్ అన్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వడదెబ్బ నివారణ చర్యలపై అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, హెల్త్ సూపర్‌వైజర్లు పెద్దపుల్లయ్య, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పొద్దుటూరు గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, మల్లు నందిని

చింతకాని, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో గురువారం గ్రామస్థులు ముత్యాలమ్మ తల్లికి బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం నూతనంగా బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించిన అనంతరం రెండో రోజు ప్రతి కుటుంబం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ బోనాల కార్యక్రమానికి హాజరైన మల్లు నందినిని సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కూరపాటి శిరీష, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు తోటకూరి ప్రగతి, కూరపాటి కిషోర్ పాల్గొన్నారు.

'పదేళ్లు పడావు పెట్టి.. ఇప్పుడు పరామర్శలా'

మధిరటౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్ల జాలిముడి ప్రాజెక్టును పడావు పెట్టిన కమల్ రాజుకు ఇప్పుడు జాలిముడి ప్రాజెక్ట్ గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ విమర్శించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌సెల్ మండల అధ్యక్షులు దుంపా వెంకటేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్‌లు చిట్టిబాబు, హరిబాబు, కర్నాటి రామారావు నాయకులు నిడమానూరు వంశీ, దారా బాలరాజు, అద్దంకి రవి, మిరియాల కాశీ, జహంగీర్, గొల్లమందల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో సత్తుపల్లి విద్యార్థుల ప్రతిభ



అవార్డు అందుకుంటున్న విద్యార్థి

సత్తుపల్లిరూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ వారు ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షలలో సత్తుపల్లిలోని వీవీ విద్యాలయం విద్యార్థులకు అవార్డులు లభించినట్లు ప్రిన్సిపాల్ గోరింట్ల వంశీకృష్ణ శుక్రవారం తెలిపారు. జీకే పరీక్షలో ఏ.దాక్షాయని రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో, పేయింటింగ్ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో ఆర్.హాసినిలు నిలిచారన్నారు. గురువారం రాత్రి హైదరాబాద్‌లో ప్రముఖ కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ బీవీ.సత్యనగేష్, సినీ ఆర్టిస్ట్ ఘర్షణ శ్రీనివాస్‌ల చేతులమీదుగా విద్యార్థులు అవార్డులు అందుకున్నారు. అదేవిధంగా బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డును తాను అందుకోగా విద్యార్థులను కరస్పాండెంట్ ఒగ్గు భగవాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించనట్లు చెప్పారు.

ఘనంగా మహిళా దినోత్సవం

కల్లూరు, మార్చి7 (ఆంధ్రజ్యోతి) కల్లూరులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, ఏఎంసీ చైర్మన్ బాగం నీరాజదేవిలను శాలువలతో ఘనంగా సన్మానించారు. మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామదీపికల సంఘం తరుపున వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామదీపికల సంఘం(ఏఐటీయూసీ) మండల అధ్యక్షురాలు వేము నాగమణి, కుమారి, నీలవేణి, కృష్ణవేణి, నాగమణి రమా, షాహిదాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

తల్లాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికాభివృద్ధిని సాధించాలని తల్లాడ ఎస్‌బీఐ మేనేజర్ ఎం.పణికుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎస్‌బీఐలో ఎస్‌బీఐ, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, ఏపీఎం అశోకరాణి తదితరులను సన్మానించారు.



కల్లూరులో ఎమ్మెల్యే రాగమయిని సన్మానిస్తున్న గ్రామదీపికలు

ముదిగొండలో...

ముదిగొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను రెవెన్యూ కార్యాలయం, యక్షశ్రీ డీజీ స్కూల్ ముదిగొండ నందు ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వహీదాసుల్తాన్, సీనియర్ అసిస్టెంట్ నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



ముదిగొండలో కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్ సునీత ఎల్జిబెత్

మహిళల హక్కులు కాపాడాలి

సత్తుపల్లి, మార్చి7 (ఆంధ్రజ్యోతి): హక్కుల కోసం పోరాడుతున్న మహిళలపై హత్యలు, అత్యాచారాలు నిత్యకృత్యమయ్యాయని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గోకినేపల్లి లలిత అన్నారు. అంతర్జాతీయ మహిళ పోరాట దినం ఆవిర్భవించిన నేటికి 114ఏళ్ల అయిన సందర్భంగా శుక్రవారం సత్తుపల్లి పట్టణంలో ఆసంఘ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జే.పరమిళ, సరోజిన, అలివేలు, కృష్ణవేణి, దుర్గ, జలాల్‌బీ, భద్రమ్మ, విజయ, చెల్లమ్మ, బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

కారేపల్లిలో...

కారేపల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలు నిర్వహిస్తున్న అందాల పోటీలను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వై.జానకి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పేరుపల్లి గ్రామంలో అంతర్జాతీయ మహిళా 114దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో అలెం సుగుణ, పద్మ, కోటమ్మ, మంగమ్మ, నిరోష, తదితరులున్నారు.